క్లుప్తంగా

నేడు వివిధ పార్టీల నాయకులతో సమావేశం

వత్సవాయి: మండలంలోని కాకరవాయి ఎంపీటీసీ స్థానానికి త్వరలో ఉప ఎన్నిక జరగనున్న తరుణంలో మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అన్ని రాజకీయపార్టీలకు చెందిన మండల పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకరవాయి, వేములనర్వ పంచాయతీలకు సంబంధించి పోలింగ్‌స్టేషన్ల వివరాలను రెండు గ్రామ పంచాయతీలతోపాటు ఎంపీడీవో కార్యాలయంలో కూడా ప్రచురిస్తామని తెలిపారు. సమావేశంలో పోలింగ్‌స్టేషన్లపై అభ్యంతరాలుంటే తెలపవచ్చని సూచించారు.

బీజేపీ పాలనలో సామాన్యుల జీవనం దుర్భరం

వీరులపాడు: బీజేపీ పాలనలో సామాన్య, పేద, మధ్యతరగతి వర్గాల జీవనం దుర్భరంగా మారిందని వామపక్ష నాయకులు అన్నారు. పెరిగిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ తహసీల్దార్ ఆశయ నాయక్‌కు సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014కు ముందు వంట గ్యాస్ ధర రూ.450 ఉండేదని, పైగా అందులో రూ.180 రాయితీ ఇచ్చేవారని గుర్తు చేశారు. ఇప్పుడు గ్యాస్ ధర రూ.1130 కాగా, ఒక్క పైసా కూడా రాయితీ ఇవ్వటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోడూరు పిచ్చేశ్వరరావు, వట్టికొండ పార్థసారథి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా అనుమోలు



నియామక పత్రాన్ని అందుకుంటున్న నూతన కార్యవర్గ నాయకులు

నందిగామ: మండల ఆర్యవైశ్య సంఘ కార్యవర్గ ఎన్నిక సోమవారం పట్టణంలోని సుఖశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో జరిగింది. ముందుగా సమావేశం నిర్వహించిన ఆర్యవైశ్య నాయకులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడి గా అనుమోలు పార్థసారథి, కార్యదర్శిగా మారం సత్యనారాయణ, కోశాధికారిగా మహంకాళి ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకుల పర్యవేక్షణలో జరిగింది.

భక్తులకు 2 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం



సిద్ధమవుతున్న లడ్డూప్రసాదాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన తిరునాళ్ల వేడుకలకు అంతా సిద్ధమైంది. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ఐదు రోజుల ఉత్సవాలకు సంబంధించి భక్తులకు 2 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశారు. అవసరమైతే అప్పటికప్పుడు ప్రసాదాలు తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు అన్నారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజులు రాత్రి సమయంలో ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల విజయానికి అందరూ సహకరించాలని కోరారు.

రేపటి నుంచి న్యాయ విజ్ఞాన సదస్సులు

జగ్గయ్యపేట అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8, 9, 10 వ తేదీల్లో జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటుచేయాలని గౌరవ న్యాయమూర్తులు నిర్ణయించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ధనుంజయుడు సోమవారం తెలిపారు. మహిళా హక్కులు, వారికి న్యాయపరమైన రక్షణ, వారికి కల్పించిన న్యాయసేవలు తదితర విషయాలపై వారికి అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈనెల 8 వ తేదీ ఉదయం 10.30కు పెనుగంచిప్రోలు పంచాయతీ కార్యాలయంలో, 9వ తేదీ సాయంత్రం 4.30కు చిల్లకల్లు ఎంపీడీవో కార్యాలయంలో, 10 వ తేదీ సాయంత్రం 4.30కు జగ్గయ్యపేట మెప్మా కార్యాలయంలో సదస్సులు జరుగుతాయని తెలిపారు.

ప్లేట్ల పంపిణీ

జగ్గయ్యపేట: హోలీ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని మణికంఠ స్టీల్ ఎంపోరియం ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు సోమవారం ప్లేట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యూత్ నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, విజయవాడ దుర్గ గుడి పాలకవర్గ సభ్యుడు నంబూరి రవి, తిరుమలగిరి ఆలయ పాలకవర్గ సభ్యుడు యన్నాకుల రాంబాబు, ఆర్యవైశ్య నాయకులు చారుగుండ్ల కొండ పాల్గొన్నారు.

పద్మావతి నగర్ కూడలి విస్తరణకు చర్యలు

- రూ.75 లక్షలతో జంక్షన్‌లో సర్కిల్ ఏర్పాటు పనులు ప్రారంభం
- ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



పద్మావతినగర్ మూడు రోడ్ల కూడలిలో జంక్షన్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ముక్త్యాల రోడ్డులో రోజు రోజుకు పెరిగిపోతున్న వాహనాల రద్దీ, రోడ్డు ప్రమాదాలను నిరోధించేందుకు పట్టణంలోని పద్మావతినగర్‌లో రూ.75 లక్షలతో జంక్షన్‌లో సర్కిల్ ఏర్పాటుచేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పద్మావతినగర్‌లోని జయంతిపురం, ముక్త్యాల, జగ్గయ్యపేట రోడ్ల కూడలిలో జంక్షన్ విస్తీర్ణం ఏర్పాటు పనులను ఉదయభాను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే పలు చోట్ల రోడ్ల నిర్మాణాలు చేపట్టామని, దానిలో భాగంగా పద్మావతినగర్‌లో జంక్షన్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. పట్టణ సమీపంలోని వివిధ ఫ్యాక్టరీలకు వెళ్లే వాహనాలతో ఈ రహదారి నిత్యం అత్యంత రద్దీగా ఉండటంతో ఈ మూడు రోడ్ల కూడలి ఇరుకుగా ఉండటంతో తరచూ ఇదే స్థలంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ మూడు రోడ్ల కూడలిని విస్తరించడం వలన ట్రాఫిక్‌ను, ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. మరో రెండు మూడు నెలల్లో ఈ పనులు పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, మారెళ్ల సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పట్టణంలోని ఓ విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న విద్యుత్, ప్రైవేట్ నెట్‌వర్క్‌ల వైర్లు

పట్టణంలోని ఏ విద్యుత్ స్తంభాన్ని పరిశీలించినా కుప్పలు తెప్పలుగా వైర్లు దర్శనమిస్తుంటాయి. కేబుల్ నెట్, ఇంటర్ నెట్, ఫైబర్ నెట్ వాళ్లు ఇష్టానుసారం వైర్లు ఏర్పాటుచేస్తున్నా, విద్యుత్ శాఖ చూసీ చూడనట్లు వ్యవహరిస్తోంది. ఈ విధంగా ఏర్పాటు చేయడం వలన గతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. వైర్లు ఏర్పాటు చేసే సమయంలో సంబంధిత నెట్ వర్క్‌ల ప్రతినిధులు విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే వీరిలో ఎంత మంది అనుమతులతో వైర్లు ఏర్పాటు చేస్తున్నారు? ఎంత మంది అనుమతులు లేకుండానే వైర్లు వేస్తున్నారు? దీనిపై విద్యుత్ శాఖ ఎందుకు స్పందించి చర్యలు తీసుకోవడం లేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు ఇళ్ల పక్కనే ఉంటున్నాయి.ముఖ్యంగా వేసవికాలంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ తరుణంలో సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

–నందిగామ

రీ సర్వేతో కచ్చితమైన కొలతలు

తహసీల్దార్ రాజకుమారి



పరిటాలలో సరిహద్దు రాళ్లను దగ్గరుండి పాతిస్తున్న తహసీల్దార్ రాజకుమారి

కంచికచర్ల: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వేతో కచ్చితమైన కొలుతలు, హద్దులు వస్తాయని ఆ భూముల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన హద్దు సర్వే రాళ్లను పాతుతున్నామని, రైతులు సహకరించాలని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి అన్నారు. మండలంలోని పరిటాలలో ప్రభుత్వ, ప్రయివేటు భూములను రీ సర్వే చేసి ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల్లో సర్వే రాళ్లను పాతుతున్న సమయంలో రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. తమ రెవెన్యూ సిబ్బందిని నాలుగు బృందాలుగా విభజించామని, ఒక్కో బృందానికి ఇద్దరు వీఆర్వోలు సూపర్‌వైజర్లుగా ఉంటారని వాటిలో మొదటి టీంకు 1 నుంచి 236 సర్వే నంబర్లు, రెండవ టీంకు 236 నుంచి 426, మూడవ టీంకు 427 నుంచి 634, నాల్గవ టీంకు 635 నుంచి 801 వరకు అప్పగించామన్నారు. ఆయా సర్వే నంబర్ల రైతులు టీం సభ్యులను సంప్రదించాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్ ఈ నెల 15వ తేదీలోగా పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు, కౌలురైతులు తమ రెవెన్యూ, అధికారులు, సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నందిగామ రాజేంద్రప్రసాద్, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, వీఆర్వోలు శ్రీలక్ష్మి, వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్దన్, రైతులు పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమంలో 8 అర్జీలు

ఆర్డీఓ రవీంద్రరావు



స్పందనలో అర్జీలు అందజేసేందుకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కావాలంటే స్పందన ద్వారానే సాధ్యమని ఆర్డీఓ రవీంద్రరావు అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు 8 అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు.డివిజన్ పరిధిలో అవసరమైన వారు స్పందనను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ముఖ్యంగా దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు సైతం స్పందన ద్వారా పరిష్కారం మవుతున్నాయన్నారు.

స్పందనలో నాలుగు అర్జీలు

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో సోమవారం నాలుగు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.రాజకుమారి తెలిపారు. ఇంటి స్థలం కావాలని ఒకరు, భూముల సర్వే చేయాలని మూడు అర్జీలు వచ్చాయని చెప్పారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి ప్రాధాన్యతాక్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఏఓ కె.వి జయకుమార్, హౌసింగ్ ఏఈ ఎ.నరసింహారావు, ఏపీఎం కోట భాస్కరరావు, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనపై భరోసాతోనే చేరికలు

వైఎస్సార్ సీపీ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న యువనేత సామినేని కృష్ణప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని, ఆ భరోసాతోనే పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక చెరువుబజారుకు చెందిన చింతల సినాయి, చింతల గోపి తదితరులు వారి కుటుంబ సభ్యులతో కలిసి తెలుగుదేశం పార్టీని వీడి సోమవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ ప్రసాద్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం చేరిన వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను నియోజకవర్గ అభివృద్ధి కోసం పడుతున్న తపన, కృషి తమను ఎంతో ఆకర్షితులను చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో దేశంలోనే అనేక రాష్ట్రాలు ఏపీ వైపు చూస్తున్నాయని, ఆయన మీద ఏర్పడిన నమ్మకంతోనే తాము వైఎస్సార్ సీపీలోకి చేరినట్లు తెలిపారు. పార్టీ నాయకులు తన్నీరు నాగేంద్ర, వేముల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం

జగ్గయ్యపేట: పట్టణంలో ఉన్న కోదండ రామాలయం పునఃనిర్మాణ పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన ఈ ఆలయంలో సుమారు రూ.1.50 కోట్లతో ఆలయ రాజగోపురాలు తదితర పనులు చేపడుతున్నట్లు ఈవో నాగరాజు తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి



చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ ప్యాకెట్లు పంచిపెడుతున్న సామినేని వెంకట కృష్ణప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: రోజు రోజుకూ తీవ్రమవుతున్న వేసవి తాపం దృష్ట్యా రోడ్డుపై నడిచివెళ్లే బాటసారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటుచేసేందుకు దాతలు ముందుకు రావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక బలుసుపాడు రోడ్‌లో వాసవి కపుల్స్ వారి ఆధ్వర్యంలో 100 రోజుల పాటు కొనసాగించేందుకు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జగ్గయ్యపేట వాసవి కపుల్స్ వారి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ నూకల సాంబ, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు చారుగుండ్ల కొండ, వాసవి కపుల్స్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త రమేష్‌కుమార్, పెనుమూరి సత్యనారాయణ, కోశాధికారి గోనుగుంట్ల ధనుంజయ, గౌరవ అధ్యక్షుడు కొత్త పురుషోత్తం, కపుల్స్ ప్రతినిధులు కొత్త కృష్ణారావు, కర్లపాటి కొండ, రాము పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయినులకు సన్మానం



స్వాతి, సరితలను సత్కరించిన యూటీఎఫ్ నాయకులు

పెనుగంచిప్రోలు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ మండల శాఖ తరఫున ఇద్దరు ఉపాధ్యాయినులను సన్మానించారు. పెనుగంచిప్రోలు జెడ్పీ హైస్కూల్(బాలికలు)కు చెందిన వి.స్వాతి, యూపీ పాఠశాలకు చెందిన వి.సరిత లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎండీ జిలానీ, అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరిపై కాంగ్రెస్ నిరసన



నందిగామలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తదితరులు

నందిగామ: కేంద్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని అదానీ లాంటి వాళ్లకు దోచిపెడుతోందని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పట్టణంలోని స్టేట్ బ్యాంక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ అదానీ అనే వ్యక్తి ఈ దేశానికి ముప్పు అని, అదానీ ఆర్థిక అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వెయ్యాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, కిరణ్, మురళీమోహన్, కర్నాటి అప్పారావు, పాలేటి సతీష్, సంజీవరెడ్డి, గింజుపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో తిరునాళ్లు విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, పక్కన తహసీల్దార్, ఎస్ఐ, తదితరులు

పెనుగంచిప్రోలు: అధికారులు, సిబ్బంది అంతా సమర్థంగా పనిచేసి శ్రీతిరుపతమ్మ వారి చిన్న తిరునాళ్ల ఉత్సవాలు విజయవంతం చేయాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. సోమవారం తిరునాళ్ల ఉత్సవాలకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ప్రాధాన్యం ఇస్తూ సిబ్బంది ఎవరికి అప్పజెప్పిన పని వారు సక్రమంగా చేయాలన్నారు. తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి మాట్లాడుతూ రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది వారికి ఇచ్చిన విధులను సక్రమంగా అమలు చేయాలన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, ఏఓ సిద్దారెడ్డి, ఈఓపీఆర్డీ వీరభద్రరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు 5 ఫాగింగ్ మిషన్ల కొనుగోలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి 5 ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఫాగింగ్ మిషన్ల పనితీరును పరీక్షించారు. కార్యక్రమంలో కమిషనర్ శివకోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో పేట విద్యార్థిని ప్రతిభ



తిరుపతమ్మను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: 10 వ అంతర్ కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల విద్యార్థి ఎం.తిరుపతమ్మ రెండు బంగారు పతకాలను సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వై.అంకయ్య, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు ఆమెను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం క్రీడా వికాస కేంద్రంలో నిర్వహించిన 10 వ అంతర్ కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఎక్విప్‌డ్, అన్ ఎక్విప్‌డ్ విభాగం జూనియర్, సీనియర్ విభాగంలో 57 కేజీల కేటగిరిలో తిరుపతమ్మ రెండు గోల్డ్ మెడల్స్ సాధించి, జూనియర్, సీనియర్ విభాగంలో స్ట్రాంగ్ ఉమెన్‌గా నిలిచిందన్నారు. ఆమెకు కోచ్‌గా గంటా వెంకటేశ్వర్లు వ్యవహరించారని తెలిపారు. కళాశాల సెక్రటరీ కె.సాయిబాబు, ఏవో కె.సత్యనారాయణరావు, పీడీ.జి.రవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి సీఎం కృషి



శిథిలావస్థకు చేరిన మార్కెట్ కమిటీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వ్యవసాయ రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలు కూడా అందుకనుగుణంగా పనిచేయాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం చైర్మన్ మహ్మద్ మస్తాన్ అధ్యక్షతన మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రైతుల సంక్షేమం, అభివృద్ధికి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో జరిగే సంతలో క్రయ, విక్రయదారులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఇప్పటికే శుక్ర, శనివారాలలో సంత జరుగుతుందని రైతుల కోరిక మేరకు బుధవారం కూడా సంత నిర్వహించేందుకు తీర్మానం చేయటం అభినందనీయమని తెలిపారు. అనంతరం శిథిలావస్థకు చేరిన మార్కెట్ కమిటీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.

ఏడు అంశాల అజెండాకు ఆమోదం

ఏడు అంశాలతో కూడిన అజెండాకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు నిధుల మంజూరుతో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులు అద్దెకు ఇచ్చేందుకు ఈ–కొనుగోలులో పాటదారులు ఆసక్తి చూపటం లేదని బహిరంగ వేలం ద్వారా షాపులు అద్దెకు ఇచ్చేలా తీర్మానం చేశారు. అనంతరం మూడు నెలలకు సంబంధించిన ఆదాయ, వ్యయాలను పరిశీలించి కమిటీ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ నల్లమల్లి మురళి, కార్యదర్శి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ స్వప్న, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

రోడ్డుపై దుకాణాలు తొలగించాలని ఆందోళన



కీసర టోల్‌ప్లాజా వద్ద రోడ్డు పక్కన దుకాణాలు తొలగించాలని ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

కీసర(కంచికచర్ల): జాతీయ రహదారిపై దుకాణాలు ఉండటంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అయినా టోల్‌ప్లాజా అధికారులు పట్టించుకోవట్లేదని గ్రామస్తులు మండిపడ్డారు. మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని గ్రామస్తులు, ప్రయాణికులు సోమవారం వాహనాల రాకపోకలు నిలిపివేసి ఆందోళన చేపట్టారు, విజయవాడ– హైదరాబాద్ నేషనల్ హైవే నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి, కీసర సెంటర్‌లో ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. కొంతమంది వ్యక్తులు రోడ్డుపైనే ఇరువైపులా టీ క్యాంటిన్, టిఫిన్ సెంటర్, భోజన హోటల్, కూల్‌డ్రింక్స్ పలు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయటంతో మిగిలిన వాహనదారులకు ఆటంకం కలుగుతోంది. రోడ్డుపై వాహనాలు నిలిచిఉండటంతో రోడ్డుపై వచ్చే వాహనాలు కనిపించక ప్రయాణికులు, వాహనదారులు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. గత వారం రోజుల నుంచి నిత్యం ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించాలని గతంలో కూడా అనేకసార్లు ఆందోళన చేసినా టోల్‌ప్లాజా అధికారులు కాని, నేషనల్ హైవే అధికారులు కాని పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి కీసర సెంటర్, టోల్‌ప్లాజా సెంటర్‌లో జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటుచేసిన దుకాణాలను తొలగించి ప్రజలు, ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని పలువురు కోరుతున్నారు.

భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం

ఈనెల 9న ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం(ఫైల్)

పెనుగంచిప్రోలు: 11వ శతాబ్దానికి చెందిన శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయాన్ని భక్తుల విరాళాలతో పునఃనిర్మించనున్నారు. మౌద్గల్య మహాముని తపస్సుతో ఏర్పడిన స్థానిక మునేరు పక్కన స్వయంభుగా వెలిసిన శంభులింగేశ్వర స్వామి ఆలయాన్ని 11వ శతాబ్దంలో సాగిపోతు రాజుగా పిలిచే విజయాదిత్యుడు నిర్మించాడని, తరువాత 17వ శతాబ్దంలో అమరావతి కేంద్రంగా పరిపాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఆలయాన్ని పునః ప్రతిష్ఠించి నిత్య ధూపదీప నైవేద్యాల నిమిత్తం సుమారుగా 33 ఎకరాల భూమిని ఇచ్చినట్లు చరిత్ర. అయితే ప్రస్తుతం ఆలయం పూర్తిగా శిథిలమై పోవటమే కాక, ధ్వజస్తంభం తుఫాన్ గాలులకు విరిగిపోయింది. దీంతో ఆలయాన్ని పునః నిర్మించేందుకు భక్తులు సిద్ధమయ్యారు.

దేవదాయ శాఖ పర్యవేక్షణలో...

దేవదాయ శాఖ పర్యవేక్షణలో ఆలయాన్ని పునః నిర్మించేందుకు శంభులింగేశ్వరస్వామి ట్రస్ట్ ఏర్పాటు చేసి పాత ఆలయాన్ని పూర్తిగా తొలగించారు. నూతన ఆలయ నిర్మాణానికి మార్చి 9న బలుసుపాడు గురుధామ్ క్షేత్రంకు చెందిన తాత్వికులు గెంటేల వెంకటరమణ దంపతులచే శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుతో పాటు పలువురు పాల్గొననున్నట్టు ట్రస్ట్ నిర్వాహకుడు వాసిరెడ్డి బెనర్జీ తెలిపారు. మొత్తం రూ.3.50 కోట్లతో శివాలయంతో పాటు వెనుక అయ్యప్పస్వామి ఆలయం కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. శివాలయ నిర్మాణం అంతా దేవదాయ శాఖ వారి పర్యవేక్షణలో జరుగుతుందని, శివాలయం ముందు రాజగోపురం, పక్కన నవగ్రహ మండపం ఉంటుందని తెలిపారు.